# తండ్రి యొక్క జ్ఞానముగా కుమారుడు

కుమారుని యొక్క జ్ఞానాన్ని మనం పూర్ణంగా అభినందించడానికిగాను, ఆయనను మనము తండ్రి యొక్క జ్ఞానంగా చూడవలసియుంటుంది. తండ్రియొక్క జ్ఞానము మొదట మనకు సృష్టియందు ప్రత్యక్షపరచబడింది. అనంతంనుండి దేవుని ముఖ వైఖరియైన కుమారుడైన దేవుడు వచ్చి విశ్వమంతటిని, లోకాన్ని, కాలాన్ని ఉనికిలోనికి తెచ్చాడు

## క్రొత్త నిబంధనలో బోధింపబడిన రీతిగా

ఆయన "మొదట" ఏమి బయలుపరచాడో అర్థం చేసికొనడానికి గాను దేవుడు "చివరిగా" ఏమి బయలుపరచాడో పరీక్షించుటచే ఆరంభానికి ముందున్న దానికి మనం చేరుకుందాం. సృష్టికి ముందుగా దేవుని యొక్క జ్ఞానమైయున్నట్టు యేసును గూర్చి క్రొత్త నిబంధన అవలోకనమును పరిశీలించుటవలన దీనిని చేద్దాం.

కాలారంభానికి ముందుగా సిలువ వేయబడిన "మహిమా స్వరూపియగు ప్రభువు" వేరు చేయబడని రూపంలో దేవుని జ్ఞానము ఉన్నట్టు క్రొత్త నిబంధన చూపుతోంది:

> పరిపూర్ణులైనవారి మధ్య జ్ఞానమును బోధించుచున్నాము, అది యీ లోక జ్ఞానము కాదు, నిరర్థకులై పోవుచున్న యీ లోకాధికారుల జ్ఞానమును కాదుగాని దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించుచున్నాము; ఈ జ్ఞానము మరుగైయుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను. అది లోకాధికారులలో ఎవనికిని తెలియదు; అది వారికి తెలిసియుండినయెడల మహిమా స్వరూపియగు ప్రభువును సిలువ వేయక పోయియుందురు ఇందునుగూర్చి దేవుడు తన్ను ప్రేమించువారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడ లేదు, మనుష్య హృదయమునకు గోచరముకాలేదు అని వ్రాయబడియున్నది. మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలుపరచియున్నాడు; ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు (1 కొరింథీ. 2:6-10).

ఈ ఆశ్చర్యకరమైన సత్యము అపొస్తలుల కాలంవరకు బయలుపరచబడలేదు ఎందుకంటే గతంలో అది "దాచబడిన" దేవుని "మర్మమై"యుంది. బయలుపరచబడిన ఈ మర్మము ఆశ్చర్యాన్ని కలిగించే మార్గాలను తెరిచింది. కాలారంభానికి ముందునుండి క్రీస్తు యొక్క సిలువకు కొనసాగిన ఒక వంతెనను పై లేఖన భాగము సూచిస్తుంది. ఆ వంతెనకు "ప్రారంభోత్సవం" జరిగినప్పుడు దేవుని జ్ఞానము క్రీస్తునందు విశదపరచబడింది.

కొలస్సీలోని క్రైస్తవులకు వ్రాసిన పౌలు పత్రికలో యేసు దేవుని జ్ఞానమైయున్న

గుర్తింపు యింకను సూచింపబడింది. ప్రత్యేకించి సృష్టిలోను, విమోచనా కార్యంలోను[1] క్రీస్తు యొక్క వ్యక్తిత్వాన్నీ, చర్యను సామాన్యం చేసే "జ్ఞానాన్ని" విశదీకరించిన బోధకులవలన వారికి ఆటంకం కలిగింది. దానికి బదులుగా, దేవుని మర్మమైయున్న క్రీస్తునందు "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి" అని పౌలు ఉద్ఘాటించాడు (కొలస్సీ. 2:3).

క్రీస్తును గూర్చి పౌలు ఈ విధంగా మాట్లాడినప్పుడు, కేవలము క్రీస్తు దేవుని జ్ఞానమును పదిలపరచు చోటైయున్నట్టు అతడు చెప్పలేదు సుమీ. దేవుడుగా, యేసు దేవుని జ్ఞానాన్ని యిప్పుడు పూర్ణంగా బయలుపరచాడని అతడు ప్రకటించాడు. క్రీస్తు దేవుని స్వరూపమైయున్నట్టు యింతకు ముందుగానే సూచించాడు. దానికి తోడు, దేవుని కుమారుడు సృష్టికి ముందుగానే ఉన్నట్టును అతడు గట్టిగా పలికాడు. బైబిలు అంతటిలో క్రీస్తును బహుగా హెచ్చించిన లేఖన భాగము కొలస్సీ. 1:16, 17ఎ, అందులో అతడిలా అన్నాడు:

> ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; …

కొలస్సీలో దేవుని సృష్టి జ్ఞానముగా వర్ణించబడ్డ కుమారుడు కేవలం దేవుని కుమారుడు మాత్రమే కాదు: ఆయన కుమారుడైన దేవుడు. ఆలాగున, "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్సీ. 2:9). *pleroma* ("సంపూర్ణత") అనే గ్రీకు పదం కొలస్సీ పత్రికలో ముందు కన్పించింది: "ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెనని … తండ్రి అభీష్టమాయెను" (కొలస్సీ. 1:19).

మరో మాటల్లో చెప్పాలంటే, దేవుని సారాంశము లేక సారము క్రీస్తునందు నివసించు చున్నది. దేవుని సారము ఆత్మ (యోహాను 4:24). క్రొత్త నిబంధనలో *theotes* అనే గ్రీకు పదం కొలస్సీ. 2:9లో మాత్రమే ఉపయోగింపబడింది. ("దేవత్వము" అని KJV; "దైవము" అని NIVలో కన్పిస్తుంది) దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత క్రీస్తునందు నివసించింది. ఇది కొలొస్సయులకు అన్వయించినంతవరకు, చారిత్రకమైన యేసును చేర్చుకొనిన నిత్య సంబంధమై ఉంది.[2]

## విమోచనయందు ప్రతిఫలించినట్టు

యేసును దేవుని జ్ఞానంగా ఆలోచించడం మన సామాన్య ప్రారంభాంశం కాదు. తండ్రియైన దేవుని కృపను, కనికరమును, ప్రేమను ప్రత్యక్షపరచిన దేవుని కుమారుడైన యేసు అను వ్యక్తి మనలో ఎక్కువ మందికి తొలిగా పరిచయం చేయబడ్డాడు. మన విమోచన కొరకు తన కుమారుని సిలువలో అర్పించునంతగా మనపట్ల తండ్రి ప్రేమ ప్రదర్శింపబడింది. మనము ప్రభువునకు సమర్పించుకొనగా, ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడ లేపబడినప్పుడు,

ఆయన మనకు రక్షకుడయ్యాడు. ఇది శుభ సందేశం, క్రీస్తు సువార్త. క్రీస్తును గూర్చి ముందుకు మనం చూస్తుండగా, దేవుని ప్రేమ, కనికరము, కృప కంటెను ఎక్కువగా ఆయన మనకు చూపుతున్నట్టు కనుగొంటాం. ఆయన మనకు స్పష్టపరచబడిన దేవుని జ్ఞానం కూడా.

పౌలు కొరింథీయులకు వ్రాసినప్పుడు, దేవుని జ్ఞానము అనేకుల దృష్టికి గోచరం కాలేదు. ఎందుకంటే వారు దానికొరకు సరియైన స్థలంలో చూడడంలేదని అతడు వారికి జ్ఞాపకం చేశాడు. యూదులు సూచక క్రియ వెర్రిలో ఉన్నారు. వారు అద్భుతాలు చూడ గోరుతున్నారు (మత్తయి 12:38, 39). గ్రీసుదేశస్థులు జ్ఞానమును వెదకుతున్నారు, అయితే ఎక్కువగా తాత్విక సాధనం ద్వారా, దానిని పౌలు "ఈ లోక జ్ఞానము" అని వర్ణించాడు. ఈ పూర్వ గాధకు వ్యతిరేకంగా, "అయితే మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము ... క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునై యున్నాడు" అని పౌలు తెలియజేశాడు (1 కొరింథీ. 1:23, 24). ఈలాగున, మన కొరకైన దేవుని రక్షణ సంకల్పము ద్వారా, క్రీస్తు మనకు "జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనము నాయెను" (1 కొరింథీ. 1:31బి). గనుక, ఆయన విమోచనా కార్యక్రమంలో, కుమారుడు తండ్రి జ్ఞానాన్నిస్తున్నాడు.

## సృష్టిలో ప్రదర్శింపబడినట్టుగా

దేవుడు ఎన్నడును ఒక అవివేకమైన కార్యమును చేసినవాడో లేక అవివేకమైన మాట పలికినవాడో కాదు, ఎందుకంటే ఆయన సర్వజ్ఞుడు, సర్వము నెరిగినవాడు. సర్వశక్తుడై యుండుట ఆయనకు ఎలా సహజ లక్షణమో, అలాగే సర్వము నెరిగియుండడం ఆయన సహజ స్వభావం. అందువలన, తన కుమారుడైన యేసునందు దేవుని జ్ఞానాన్ని చూడడంలో లేక కనుగొనడంలో మనం ఆశ్చర్యపడనవసరం లేదు. నిత్యత్వంలోను, సృష్టిలోను ఆయన తనయందున్న దేవుని జ్ఞానము యొక్క ప్రత్యక్షతయై ఉన్నాడు.

ఇప్పుడు మనం దేవుని జ్ఞానాన్ని "బహు సమీపంగా" యేసునందు కనుగొన్నాం, "చాల వెనుకకు" వెళ్లి మిక్కిలి ముఖ్యమైన సృష్టి సంఘటనను తిలకించుదాం. అక్కడ జ్ఞానముంది! అది మనకు ఆశ్చర్యం కలిగిస్తుందా? తప్పక లేదు. దేవుని స్వభావము దృష్ట్యా (ఆయన సర్వజ్ఞుడైనందున), యేసునందు తరువాత యివ్వబడిన (కొత్త నిబంధన) దేవుని ప్రత్యక్షత యొక్క వెలుగులో, సృష్టి (ఆరంభానికి) ముందు కూడా జ్ఞానమున్నట్టు మనం కనుగొన లేకపోతే మనం నిజంగా అబ్బురపడిపోతాం.

దేవుని జ్ఞానంతో యేసుకు క్రొత్త నిబంధన ఉపదేశాలు సంబంధం కలిగిస్తున్నాయి. దేవుని జ్ఞానము శాశ్వతమైనది మరియు సృష్టియందు అది పని చేసినట్టు అక్కడ కనుగొన్న సత్యాలు చూపుతున్నాయి. వాస్తవంగా, క్రొత్త నిబంధన లేఖకులయొక్క అవలోకనంలో, దేవుని సృష్టి కార్యక్రమంలో చురుకుగా పని కలిగియున్నట్టు మనం చూచే దేవుని జ్ఞానము దేవుని కుమారుడే. పరిశుద్ధాత్మవలన అంత లోతైన అంతర్భావాన్ని చూడనవకాశం పొందిన మనుష్యుల కండ్లగుండా చూచే మనం ఎంత అధిక్యతగలవారమై ఉన్నామో!

వారి ద్వారా పూర్వకాలపు ప్రవక్తలుగాని, దేవదూతలుగాని పూర్తిగా గ్రహించలేని సత్యాలను మనం చూస్తున్నాం (1 పేతురు 1:10–12; 2 పేతురు 1:19–21). "వృద్ధిచెందెడి బయల్పాటును" దేవుడు అనుసరించినట్టు దీని భావమా? అవును దాని భావం అదే! బైబిలు భాష అనేదానికి అర్థమేదైనా ఉన్నట్టయితే, పాత నిబంధనలో కంటెను క్రొత్త నిబంధనలో దేవుని మరి సంపూర్ణంగా మనం చూస్తాం. దేవుని "వృద్ధిచెందెడి బయల్పాటు" మరియు మన కొరకైన ఆయన చిత్తము లేఖనాల్లో గోచరిస్తుంది, మరియు అది లేఖనాలకు మాత్రమే పరిమితి చేయబడింది. ఇది రెండు నిబంధనలలోను స్థిరపరచబడింది (ద్వితీయో. 4:2; 12:32; సామెతలు 30:5, 6; ప్రకటన 22:18, 19). ఆయన ప్రత్యక్షతను గూర్చియు, ఆయన వాక్యమును గూర్చియు దేవుని యొక్క అక్కరను కనుపరచే ఉదాహరణలు తరచుగా ఉన్నాయి.

క్రొత్త నిబంధన యొక్క దైవ ప్రేరేపితులగు లేఖకులద్వారా, సామెతలు 8:22–31లోని రచయిత చూచిన దానికంటె ఎక్కువైన దానిని మనం చూడగలుగుతున్నాం. సృష్టిలో జ్ఞానము అనే దేవుని గుణ లక్షణం మహిమాయుక్తంగాను ఆనందదాయకంగాను అక్కడ వ్యక్తపరచబడింది. ఈ సంగతి మనం సామెతల లేఖనంలో కూడా పరికించవచ్చు. క్రొత్త నిబంధన ప్రత్యక్షతవలన కలిగిన ఉపకారంవలన, జ్ఞానమనేది దేవుని అసలైన సారము (ఎసెన్స్) ఒక వ్యక్తిగా వ్యక్తపరచబడ్డాడు – జ్ఞానమనే మనోగోచరమగు భావనను కేవలం వ్యక్తీకరణ అలంకారంతో పద్య రూపంలో కనుపరచడమే కాదు. మరోవిధంగా చెప్పాలంటే, సృష్టిలో దేవుని జ్ఞానాన్ని దేవుని కుమారుడు ప్రతిఫలింపజేసినట్టు మనం చూస్తాం. ఒక రచయిత యిలా అన్నాడు.

> ... అసలైన ఆరంభాలు జ్ఞానము యొక్క అధికారం వ్యక్తీకరించబడిన సృష్టి క్రమముకంటె ఎక్కువైనదైనట్టు చెప్పుతుంది. ఎలాగో, ప్రభువుతో జ్ఞానము ఐడెంటిఫై చేయబడుతుంది. జ్ఞానమనే స్త్రీ యొక్క పిలుపు ప్రభువు యొక్క స్వరమైయుంది; కేవలం ప్రకృతి యొక్క స్వయం ప్రత్యక్షత కాక, ఆమె దేవుని యొక్క ప్రత్యక్షతయై యుంది.[3]

దేవుని యొక్క జ్ఞానముగా క్రీస్తు, ఆ జ్ఞానమును సృష్టిలోను, లోకము యొక్క విమోచనలోను ప్రతిఫలింపజేశాడు. వాటినుండి మనం మేలు పొందేలా వీటి సహవాసాలు బైబిల్లో ఉన్నాయి. క్రీస్తు దేవుని జ్ఞానమైయున్నట్టు పౌలు తీర్మానానికి వచ్చాడు – గనుక – వాస్తవంగా, క్రైస్తవులు అదే తీర్మానానికి రావచ్చు (1 కొరింథీ. 1:24).

సూచనలు

[1] Everett Ferguson, *Backgrounds of Early Christianity* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 245-49. [2]కొలస్సీ. 1:20. See Gerhard Delling, *"pleroma,"* in *Theological Dictionary of the New Testament*, ed. Gerhard Friedrich, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1968), 6:302-5. [3] Roland E. Murphy, *The Tree of Life*, The Anchor Bible Reference Library, gen. ed. David Noel Freedman (New York: Doubleday, 1990), 138, 147.